క్లుప్తంగా

గంగమ్మకు విశేష పూజలు


ప్రత్యేక అలంకారంలో అమ్మవారు

కడప కల్చరల్ : కడప నగరం హనుమప్పవీధిలోని నడివీధి గంగమ్మ ఆలయంలో శుక్రవారం అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. ఆషాఢమాసం చివరి శుక్రవారం కావడంతో నిర్వాహకులు గోపాల్‌సింగ్ స్థానిక భక్తుల బృందం ఉదయం నుంచి అమ్మవారికి 21 రకాల రంగురంగుల పూలతో మనోహరంగా అలంకరించారు. కనుల పండువగా ఉన్న ఈ అలంకారం చూసేందుకు చుట్టుపక్కల ఉన్న భక్తులు కూడా అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్వాహకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

గోవులను పరిరక్షించాలి


గోశాలలో గోవులను పరిశీలిస్తున్న అడిషనల్ కమిషనర్ రాకేష్ చంద్రన్

కడప కార్పొరేషన్ : చింతకొమ్మదిన్నె మండలంలోని గోశాలలో ఉన్న గోవులకు ఎలాంటి ఇబ్బంది రాకుండా పరిరక్షించాలని నగరపాలక అడిషనల్ కమిషనర్ రాకేష్ చంద్రన్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన గోశాలను పరిశీలించారు. గోవులకు కావాలసిన మేత, ఆరోగ్య విషయాల్లో జాప్యం చేయకుండా వెటర్నరీ డాక్టర్ల ద్వారా పరీక్షలు చేయించాలన్నారు. పుట్లంపల్లెలో ఎస్సీసీని పరిశీలించి కంపోస్టు రిజిస్టర్లను తనిఖీ చేశారు. బాలాజీనగర్‌లో ఎస్వీ డిగ్రీ కళాశాల బ్రిడ్జి కింద చెత్త చెదారం పడేయకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. చెత్త పాయింట్లలో చెత్తను శుభ్రం చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నగరపాలక అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అప్లైడ్ మ్యాథమెటిక్స్‌లో డాక్టరేట్


నాగరాజు


వైవీయూ: యోగివేమన విశ్వవిద్యాలయం అప్లైడ్ మేథమేటిక్స్ పరిశోధకుడు పి.నాగరాజుకు విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రదానం చేసింది. అప్లైడ్ మ్యాథమెటిక్స్ సహ ఆచార్యులు డాక్టర్ ఎం.శ్రీధర్‌బాబు పర్యవేక్షణలో 'హీట్ ట్రాన్స్‌ఫర్ అనాలసిస్ ఆఫ్ ఎం.హెచ్.డి నాన్ న్యూటోనియన్ ఫ్లూయిడ్ ఫ్లోస్ ఓవర్ ఆన్ ఇంక్లైండ్ ఎలాంగోటేడ్ సీట్' అనే అంశంపై చేసిన పరిశోధనకు గాను ఈయనకు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య ఎస్.ఈశ్వరరెడ్డి ప్రకటించారు.

నూతన కార్యవర్గం


ఏబీవీపీ వైవీయూశాఖ నూతన కార్యవర్గం

వైవీయూ : అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) యోగివేమన విశ్వవిద్యాలయం శాఖ నూతన కార్యవర్గం ఏర్పాటైంది. శుక్రవారం విశ్వవిద్యాలయంలో నిర్వహించిన సమావేశంలో అధ్యక్షుడుగా హనీష్‌బాబు, కార్యదర్శిగా ప్రేమ్‌సాగర్‌లను ఎన్నుకున్నట్లు ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కోడూరు మల్లికార్జున తెలిపారు. వీరితోపాటు ఉపాధ్యక్షులుగా పుల్లయ్య, జె.వి. వల్లి, స్టూడెంట్ ఫర్ సేవ కన్వీనర్‌గా గణేష్, యూనివర్సిటీ స్టూడెంట్ ఫర్ డెవలప్‌మెంట్ కన్వీనర్‌గా అనిల్, కళామంచ్ కన్వీనర్‌గా ముత్యం, సభ్యులుగా అశోక్, రవి, పవన్‌లను ఎన్నుకున్నారు. వీరికి జిల్లా కన్వీనర్ మాణిక్యరాజు, చందు, శివచరణ్ శుభాకాంక్షలు తెలిపారు.

అక్రమ కట్టడాలను అడ్డుకోవాలి


ఆక్రమణలు తొలగించిన ప్రాంతంలో తిరిగి ప్రారంభమైన కట్టడాలు

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప నగరం గంజికుంట కాలనీ ప్రాంతంలో అక్రమ కట్టడాలను అడ్డుకునేందుకు తగిన చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. రోడ్డు విస్తరణలో భాగంగా ఉన్నటువంటి అక్రమ కట్టడాలను తొలిగించగా మిగిలిన ప్రభుత్వస్థలంలో తిరిగి అక్రమ కట్టడాలను కడుతున్నారని మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశామన్నారు. ప్రభుత్వ స్థలాలను కబ్జా చేస్తూ భూదందాలు కొనసాగుతున్నాయని, అధికారులు తగిన చర్యలు వెంటనే తీసుకోవాలని వారు కోరారు. ఈ విషయంగా తహసీల్దార్‌కు కూడా ఫిర్యాదు చేశామన్నారు. ఆక్రమణలను తొలగించి ఆ స్థలం ప్రజాప్రయోజనాలకు ఉపయోగపడేలా చూడాలని కోరుతున్నామన్నారు.

రైజింగ్ రాకెట్స్..!

- బ్యాడ్మింటన్ పోటీల్లో సత్తా చాటుతున్న చిన్నారులు
- రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

కడప నగరానికి చెందిన చిన్నారులు.. రాకెట్ చేతబట్టి బ్యాడ్మింటన్ సాధన చేయడంతో పాటు పతకాలు సాధిస్తున్నారు. భవిష్యత్ తరానికి మేమే రైజింగ్ రాకెట్స్ అంటూ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. కడప నగరంలోని వైఎస్‌ఆర్ ఇండోర్ స్టేడియంలో శిక్షణ పొందుతున్న 12 మంది క్రీడాకారులు జిల్లాస్థాయి టోర్నమెంట్‌లో పతకాలు సాధించడంతో పాటు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు.

కడప స్పోర్ట్స్: కడప నగరంలోని వైఎస్‌ఆర్ ఇండోర్ స్టేడియంలో బ్యాడ్మింటన్ శిక్షకులు సుదర్శన్ సిద్ధిఖ్, జాకీర్ ఆధ్వర్యంలో ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో బ్యాడ్మింటన్ శిక్షణ కొనసాగుతోంది. ఉదయం వేళల్లో ఫిట్‌నెస్‌కు ప్రాధాన్యత ఇచ్చేలా అవుట్‌డోర్‌లో వర్కవుట్ చేస్తున్నారు. సాయంత్రం వేళల్లో బ్యాడ్మింటన్‌లో బేసిక్ శిక్షణ మొదలు టోర్నమెంట్‌లో పాల్గొనే స్థాయి వరకు శిక్షణ అందిస్తున్నారు. సర్వీస్, ఫుట్‌వర్క్, స్మాష్, డ్రాప్ తదితర అంశాల్లో శిక్షణ అందిస్తున్నారు. ఇక్కడ శిక్షణ పొందిన క్రీడాకారులు జూలై 21న ప్రొద్దుటూరు పట్టణంలో నిర్వహించిన జిల్లాస్థాయి బ్యాడ్మింటన్ పోటీల్లో 12 మంది క్రీడాకారులు పతకాలు సాధించారు. త్వరలో నెల్లూరు (అండర్-11), కృష్ణా (అండర్-13), అనంతపురం (అండర్-15)లలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో వీరు పాల్గొననున్నారు. పతకాలు సాధించిన క్రీడాకారులను జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి కె. జగన్నాథరెడ్డి అభినందించారు.


బ్యాడ్మింటన్ సాధన చేస్తున్న క్రీడాకారులు


ఫిట్‌నెస్ చేస్తున్న క్రీడాకారులు

అండర్-11 డబుల్స్ విభాగంలో విజేతగా నిలిచాను



ప్రొద్దుటూరులో నిర్వహించిన జిల్లాస్థాయి బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో అండర్-11 బాలికల డబుల్స్ విభాగంలో పాల్గొని విజయం సాధించాను. ప్రతిరోజూ సాయంత్రం వేళల్లో స్టేడియంకు వచ్చి సాధన చేస్తాను.

– సి. జస్విత, కడప

ప్రతి రోజూ సాధన చేస్తున్నాను



పాఠశాల నుంచి ఇంటికి వచ్చిన తర్వాత సాయంత్రం ఇండోర్ స్టేడియంలో బ్యాడ్మింటన్ శిక్షణకు వస్తున్నాను. తొలిసారిగా జిల్లాస్థాయి టోర్నమెంట్‌లో పాల్గొన్నా. పతకం రాకపోయినప్పటికీ బాగానే ఆడాను. భవిష్యత్తులో మంచి క్రీడాకారుడిగా రాణించాలన్నదే నా లక్ష్యం.

– వి. తన్విష్, కడప

రెండు పతకాలు సాధించా



అండర్-11 బాలికల సింగిల్స్ విభాగంలో విజేతగా నిలువడంతోపాటు అండర్-11 బాలికల డబుల్స్ విభాగంలో రన్నరప్‌గా నిలిచి రెండు పతకాలు సాధించాను. రోజూ సాధన చేస్తున్నాను. ఉన్నతశ్రేణి బ్యాడ్మింటన్ ఆడాలన్నదే నా లక్ష్యం.

– డి. ప్రణవి, కడప

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాను



అండర్-13 బాలికల సింగిల్స్ విభాగంలో రన్నరప్‌గా, డబుల్స్ విభాగంలో విజేతగా నిలిచాను. తద్వారా రెండు విభాగాల్లో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికకావడం సంతోషంగా ఉంది. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధిస్తాను.

– వి. శ్రీకావ్య, కడప

తెలుగు రంగస్థలానికి వెలుగునిచ్చిన 'రాఘువ'


కళాకారులను సత్కరిస్తున్న మల్లికార్జునరెడ్డి, తదితరులు


బళ్లారి రాఘవ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బ్రౌన్ కేంద్రం ప్రతినిధులు, సిబ్బంది

కడప కల్చరల్ : తెలుగు నాటకానికి ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు గౌరవాలు తెచ్చిపెట్టిన బళ్లారి రాఘవయ్య మహానటుడిగా ఈ ప్రాంతం ప్రతిష్టను ఎంతగానో పెంచారని వైఎస్సార్ జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి తెలియజేశారు. కడప రాజీవ్ కల్చరల్ క్లబ్‌లో శుక్రవారం ఉదయం వైఎస్సార్ జిల్లా రచయితల సంఘం బళ్లారి రాఘవ 145వ జయంతిని ఘనంగా నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. నటులు గువ్వల సుబ్బరాయుడు, ఎర్రమాసుపల్లె నాదెండ్ల చిన్న సుబ్బరాయుడు, తుడుములదిన్నె ఎర్రమల్లు రామయ్య, ప్రొద్దుటూరు నాగరాజులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పాలెం వేణుగోపాల్, జీవకళ సత్యనారాయణ, గంగయ్య పట్నం సుబ్బరాయుడు, రామసుబ్బయ్య, తిప్పలూరు ఓబులేసు, బాల ఓబయ్య, రామప్రసాద్ రెడ్డి పాల్గొన్నారు.

సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో..

నిన్నటితరం తెలుగు నాటకరంగానికి బళ్లారి రాఘవయ్య రారాజుగా ఖ్యాతి గాంచారని సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం ప్రతినిధులు కొనియాడారు. యోగి వేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో శుక్రవారం ప్రసిద్ధ నటుడు బళ్ళారి రాఘవ 145వ జయంతిని నిర్వహించారు. తొలుత పరిశోధన కేంద్రం సిబ్బంది, పాఠకులు కలిసి బళ్ళారి రాఘవ చిత్రపటం వద్ద నివాళులర్పించారు.

- మన జాతీయ పతాక నిర్మాత పింగళి వెంకయ్య 147 జయంతి కూడా ఈరోజే కావడంతో ఆయనకు గ్రంథాలయ సిబ్బంది నివాళులర్పించారు. జాతీయ పతాకం నిర్మాణంలోనూ, స్వాతంత్ర్య పోరాటంలోనూ ఆయన పాత్రను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో బ్రౌన్ కేంద్రం సహాయ పరిశోధకులు డాక్టర్ చింతకుంట శివారెడ్డి, గ్రంథాలయ సహాయకులు జి.హరిభూషణరావు, జూనియర్ అసిస్టెంట్ ఆర్.వెంకటరమణ, సిబ్బంది నీలకంఠేశ్వర్, సుమతి, హరి, రచయిత కొత్తపల్లి రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణపై సుప్రీం తీర్పు హర్షణీయం


అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మాదిగ దండోరా నేతలు

కడప రూరల్ : సుప్రీంకోర్టు ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా తీర్పు ఇవ్వడం హర్షణీయమని మాదిగ దండోరా నేతలు అన్నారు. ఆ సంఘం రాష్ట్ర నాయకులు పచారం బాలసుబ్బయ్య ఆధ్వర్యంలో కడప నగర శివార్లలోని డాక్టర్ అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి, నివాళులు అర్పించారు. అనంతరం సుబ్బరాయుడు ఓబులపతి, ఆర్‌ఎస్ రాజా మాట్లాడుతూ సీఎం చంద్రబాబునాయుడు వెంటనే ఎస్సీ వర్గీకరణను చేపట్టి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో మదన్, కే వెంకట్, నాగరాజు, సుధాకర్, కనకరాజు, బాబు తదితరులు పాల్గొన్నారు.

ఏమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో..

ఏమ్మార్పీఎస్ (పేరుపోగు వర్గం) ఆధ్వర్యంలో స్థానిక బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు మునెయ్య, జిల్లా అధ్యక్షులు శివ, అట్లూరు సుబ్బరాయుడు, మాతంగి సుబ్బరాయుడు, తదితరులు పాల్గొన్నారు.

మాదిగ జాతికి న్యాయం

సుప్రీంకోర్టు తీర్పుతో మాదిగ జాతికి న్యాయం జరిగిందని ఏపీ ఎమ్మార్పీఎస్ నాయకులు బీసీ గంగులు, పీ ఆంజనేయులు ఒక ప్రకటనలో తెలిపారు.

కెనరా బ్యాంకు సేవలు సద్వినియోగం చేసుకోవాలి


బ్యాంకు సేవలపై కరపత్రాలు అందజేస్తున్న బ్యాంకు అధికారులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : కెనరా బ్యాంకు ఖాతాదారులతోపాటు ప్రజలకు అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని బ్యాంకు అధికారులు సూచించారు. శుక్రవారం కెనరా బ్యాంకు ఆధ్వర్యంలో కెనరా ఏంజెల్ స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని బ్యాంకు ఉన్నతాధికారులు ప్రారంభించారు. ఈ సందనర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు, వ్యాపారవేత్తలు, మహిళలు, ఉద్యోగులు ఇలా అన్ని వర్గాలకు అనుగుణంగా వివిధ స్కీమ్‌లను అందుబాటులోకి తేవడం జరిగిందన్నారు. కెనరా బ్యాంకులో ఖాతాలు తెరిచి బ్యాంకు అందిస్తున్న సేవలను వినియోగించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా బ్యాంకు అమలు చేస్తున్న వివిధ స్కీమ్‌లపై రూపొందించిన కరపత్రాలను ప్రజలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు డీఎం రమేష్‌తోపాటు ప్రాంతీయ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా పింగళి వెంకయ్య జయంతి


పింగళి వెంకయ్య చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న వీసీ, వివిధ విభాగాల కోఆర్డినేటర్లు

ఏఎఫ్‌యూ : కడప నగరంలోని డాక్టర్ వైఎస్‌ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ విశ్వవిద్యాలయంలో శుక్రవారం జాతీయ పతాక రూపకర్త పింగళి వెంకయ్య 148వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పింగళి వెంకయ్య చిత్రపటానికి విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ ఆచార్య జి.విశ్వనాథకుమార్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ దేశానికి జాతీయ పతాకం అవసరమైన సమయంలో గాంధీజీ సూచనల మేరకు పతాకాన్ని రూపకల్పన చేసిన గొప్ప స్వాతంత్ర్య సమరయోధుడు, దేశభక్తుడు అని కొనియాడారు. ఆయన మరణానంతరం జాతీయ పతాకాన్ని ఆయనపై కప్పాలని సంకల్పించిన వ్యక్తి అని పేర్కొన్నారు. ఇంతటి గొప్పవ్యక్తి తెలుగువాడు కావడం మనందరికీ గర్వకారణమన్నారు. కార్యక్రమం ఇన్‌చార్జి రిజిస్ట్రార్ రాజేష్ కుమార్ రెడ్డి, నేషనల్ ఈవెంట్ కోఆర్డినేటర్ మనోహర్ రావ్, వివిధ విభాగాల కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.

కడప ఎడ్యుకేషన్ : స్థానిక హబీబుల్లా వీధిలోని నందమూరి బాలకృష్ణ అభిమాన సంఘం కార్యాలయంలో పింగళి వెంకయ్య జయంతిని నిర్వహించారు. ఆ సంఘం ఉపాధ్యక్షులు అల్లా బకాష్, రాయల్ కరీం సేవా సమితి వ్యవస్థాపకులు అబ్దుల్ షేక్ రాయల్ కరీముల్లా, అబ్దుల్లాబాబు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీని కలిసిన వైఎస్సార్‌సీపీ నాయకులు


ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డితో వైఎస్సార్‌సీపీ నాయకులు

కడప కార్పొరేషన్ : కడప పార్లమెంటు సభ్యులు వైఎస్ అవినాష్‌రెడ్డిని కడప నగరానికి చెందిన కార్పొరేటర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు కలిశారు. కడపలోని క్యాంపు కార్యాలయంలో వారు ఆయన్ను కలిసి పలు సమస్యలు విన్నవించారు. వాటిని సావధానంగా విని నోట్ చేసుకున్న ఆయన పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఎంపీని కలిసిన వారిలో వైఎస్సార్‌సీపీ గల్ఫ్ కన్వీనర్ బీహెచ్ ఇలియాస్, డిప్యూటీ మేయర్ నిత్యానంద రెడ్డి, కార్పొరేటర్లు పాకా సురేష్, బాలస్వామిరెడ్డి, మల్లికార్జున, మైనార్టీ నాయకుడు మున్నా, డివిజన్ ఇన్‌చార్జులు సుబ్బరాయుడు, రామక్రిష్ణారెడ్డి ఉన్నారు.

మానసిక ఆరోగ్యం ఎంతో ముఖ్యం


ర్యాలీలో పాల్గొన్న వైద్య బృందం, విద్యార్థులు

వైవీయూ : విద్యార్థులకు శారీరక ఆరోగ్యంతోపాటు మానసిక ఆరోగ్యం ఎంతో ముఖ్యమైనదని జిల్లా మానసిక ఆరోగ్య విభాగం వైద్యురాలు డాక్టర్ అనూష పేర్కొన్నారు. శుక్రవారం కడప నగరంలోని ఏపీ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్‌లో జిల్లా మెంటల్ హెల్త్ విభాగం ఆధ్వర్యంలో జాతీయ మానసిక ఆరోగ్య వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు అవగాహన కార్యక్రమం, చైతన్య ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏవైనా మానసిక సమస్యలు తలెత్తితే వైద్యులను సంప్రదించాలని సూచించారు. క్లినికల్ సైకాలజిస్టు కె.శిల్ప మాట్లాడుతూ ఒక వ్యక్తి తనలో తాను మాట్లాడటం, నవ్వుతూ ఉండటం, పదే పదే చేతులు కడగటం, చెవిలో ఏవో శబ్దాలు వినపడుతున్నట్లు, ఒంటరితనాన్ని కోరుకోవడం, ఎవరితోనూ కలువకపోవడం, ఫోన్‌చూడటం, పిల్లల్లో వచ్చే శారీరక, మానసిక రుగ్మతల గురించి వివరించారు. కార్యక్రమంలో సైక్రియాటిక్ సోషల్ వర్కర్లు సుమన్‌బాబు, వీరావతి పాఠశాల ప్రిన్సిపాల్ పి.విజయలక్ష్మి, ఆశావర్కర్లు, ఏఎన్ఎంలు, విద్యార్థులు పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి


ఆలంఖాన్‌పల్లెలో ఫ్రైడే డ్రైడేపై అవగాహన కల్పిస్తున్న డీఎంహెచ్‌ఓ నాగరాజు

కడప రూరల్ : పరిశుభ్రమైన వాతావరణంతోనే మెరుగైన ఆరోగ్యం సమకూరుతుందని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ నాగరాజు తెలిపారు. శుక్రవారం స్థానిక ఆలంఖాన్‌పల్లెలో నిర్వహించిన ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో పాల్గొన్నారు. స్థానికులకు, వైద్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఇంటి సరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. మురికి కాలువల్లో చేత్తను వేయకూడదని తెలిపారు. అలాగే తల్లి పాల వారోత్సవాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా నివారణ అధికారి మనోరమ, డాక్టర్ నిషిత, ఒబేదుల్లా, అసిస్టెంట్ మలేరియా అధికారి వెంకటరెడ్డి, నాగలక్ష్మి తదితరులు పల్గొన్నారు.

4న చిత్రలేఖన, వ్యాసరచన పోటీలు


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న డీఈఓ అనూరాధ

కడప కల్చరల్ : బాలోత్సవ్ ఆధ్వర్యంలో ఈనెల 4వ తేదీన నగరంలోని విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలను నిర్వహించనున్నట్లు డీఈఓ అనూరాధ తెలిపారు. ఈ పోటీలకు సంబంధించిన పోస్టర్లను శుక్రవారం ఆమె తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ బాలోత్సవం ఆధ్వర్యంలో స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ఉదయం చిత్రలేఖనం, మధ్యాహ్నం వ్యాసరచన పోటీలు ఉంటాయని వివరించారు. ఎస్వీ ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించే ఈ కార్యక్రమం విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించుటకు, ఆహ్లాదం కోసం తోడ్పడుతుందన్నారు. కార్యక్రమంలో బాలోత్సవ అధ్యక్షుడు గోపాల్, రాజశేఖర్ రాహుల్, సునీత, బాలయల్లా రెడ్డి, సుందరయ్య, వెంకటేశ్వర్లు, అరుణ, మధుసూధన్, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

వైవీయూను సందర్శించిన గజల్ శ్రీనివాస్


గాయకుడు గజల్ శ్రీనివాస్‌ను సత్కరిస్తున్న వీసీ ఆచార్య కె.కృష్ణారెడ్డి

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయాన్ని ప్రముఖ గాయకుడు గజల్ శ్రీనివాస్ సందర్శించారు. శుక్రవారం విశ్వవిద్యాలయానికి విచ్చేసిన ఆయన వైస్ చాన్సలర్ ఆచార్య కే.కృష్ణారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయం గురించి అడిగి తెలుసుకున్నారు. దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు ఫౌండేషన్ తరపున విశ్వవిద్యాలయంలో ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్ ఏర్పాటు ఆలోచనను వీసీ ముందు ఉంచారు. విశ్వవిద్యాలయంలో ఆహ్లాదకరమైన వాతావరణం ఉందన్నారు. ఇక్కడ ఇన్‌స్టిట్యూట్ ఏర్పాటు చేయడం ద్వారా విద్యార్థులకు నటనలో మంచి అవకాశాలను అందిపుచ్చుకోవచ్చన్నారు. ఈ ప్రాంత సంస్కృతిని, వారసత్వాన్ని విస్తృతం చేస్తామని తెలిపారు. సినిమా షూటింగ్‌లకు అనువైన వాతావరణం ఇక్కడ ఉందన్నారు. ఇన్‌స్టిట్యూట్ ఏర్పాటుపై వీసీ సానుకూలత వ్యక్తం చేశారు. అనంతరం ఆయన్ను వీసీ శాలువ, జ్ఞాపికతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ విద్య క్రీడల శాస్త్ర శాఖ సహ ఆచార్యులు డాక్టర్ కె.రామసుబ్బారెడ్డి, ఇంజనీర్ రామచంద్రారెడ్డి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు మార్చాలి

కడప ఎడ్యుకేషన్ : రాష్ట్ర ఎస్సీఆర్టీ విడుదల చేసినటువంటి అకడమిక్ క్యాలెండర్‌లో ఆగస్టు నెలలో 16 ,17 తేదీలలో స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు ఉంటాయని షెడ్యూల్ విడుదల చేసినట్లు ఏపీటీఎఫ్ అమరావతి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ సీవీ ప్రసాద్, చంగల రెడ్డి, జిల్లా అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు ఈశ్వరచంద్ర, అలీఖాన్ తెలిపారు. అయితే 16వ తేదీన వరలక్ష్మి వ్రతం ఆప్షనల్ సెలవు దినం కావున కాంప్లెక్స్ సమావేశాలను మార్పు చేయాలని ఉన్నత విద్యాశాఖ అధికారులను వారు కోరారు.

ఆ అధికారి నియామకం తగదు

కడప కోటిరెడ్డిసర్కిల్ : హిందువుల మనోభావాలు దెబ్బతీసేలా విగ్రహాలు కూలదోచిన ఘనత తహసీల్దార్ శివరామిరెడ్డికి ఉందని, అలాంటి వ్యక్తిని కమలాపురం తహసీల్దార్‌గా నియమించడం తగదని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా వెంకటసుబ్బారెడ్డి తెలిపారు. కడపలోని ఆ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తహసీల్దార్ శివరామిరెడ్డిని సస్పెండ్ చేయాలని హిందూ సంఘాలు పెద్ద ఎత్తున ఆందోళన చేసిన మాట వాస్తవమన్నారు. అవినీతికి కేరాఫ్ అడ్రస్‌గా ఉన్న శివరామిరెడ్డిని కమలాపురం ఎమ్మార్వోగా వేసుకోవడం వల్ల కమలాపురం ఎమ్మెల్యేకు కూడా అవినీతి మరక అంటుకునే అవకాశం ఉందన్నారు. ఈ సమావేశంలో బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్ వలంటీర్ల బాధ్యతలు గొప్పవి

వైవీయూ : జాతీయ సేవాపథకం వలంటీర్ల బాధ్యతలు కీలకమైనవని యోగివేమన విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య ఎస్.రఘునాథరెడ్డి అన్నారు. యోగివేమన విశ్వవిద్యాలయం జాతీయ సేవాపథకం యూనిట్-2 ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఎస్వీ వెంకటరమణ ఆధ్వర్యంలో విశ్వవిద్యాలయ ప్రధానాచార్యుల కార్యాలయ పరిసర ప్రాంతాలను స్వచ్ఛత కార్యక్రమాన్ని రిజిస్ట్రార్ ప్రారంభించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైవీయూ వలంటీర్లకు ఒక ప్రత్యేక గుర్తింపు ఉందని, మరింతగా సేవా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త డా.వెంకట్రామిరెడ్డి పాల్గొని పలు సూచనలు ఇచ్చారు. పిచ్చి మొక్కలను, ప్లాస్టిక్‌ను వలంటీర్లు తొలగించారు.

భవన నిర్మాణ కార్మికులను ఆదుకోవాలి


నిరసన తెలుపుతున్న భవన నిర్మాణ కార్మికులు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: జిల్లాలో ఇసుక కొరత తీర్చి భవన నిర్మాణ కార్మికులను ఆదుకోవాలని ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రటరీ కెసి.బాదుల్లా, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కే లింగన్న కోరారు. శుక్రవారం స్థానిక రవీంద్ర నగర్‌లో భవన నిర్మాణ కార్మికుల సమావేశం నిర్వహించి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ప్రభుత్వం నూతన ఉచిత ఇసుక పాలసీ అమలులో రీచ్‌లు అందుబాటులో లేకపోవడంతో ఇసుక దొరకని పరిస్థితి నెలకొందన్నారు. ఇసుక మాఫియా మాత్రం బ్లాక్ మార్కెట్లో ఇసుక తరలించి సొమ్ము చేసుకుంటోందని ఆరోపించారు. ఇసుక మాఫియాపై ఉక్కుపాదం మోపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మికులు బ్రహ్మయ్య, రంగా, రాముడు, నరసమ్మ తదితరులు పాల్గొన్నారు.

జీవో 77ను రద్దు చేయాలి



మాట్లాడుతున్న పీఆర్‌ఎస్‌వైఎఫ్ నాయకులు

కడప ఎడ్యుకేషన్ : పేద, బడుగు, బలహీనవర్గాల విద్యార్థులకు ఉన్నత విద్యను దూరం చేస్తున్న జీవో నంబర్ 77ను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని పీఆర్‌ఎస్‌వైఎఫ్ రాష్ట్ర కన్వీనర్ కన్నెలూరు శంకర్ డిమాండ్ చేశారు. శుక్రవారం కడప నగరంలోని పీఆర్‌ఎస్‌వైఎఫ్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జీవో 77 వల్ల రాష్ట్రవ్యాప్తంగా కొన్ని వేల మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థిని, విద్యార్థులు ఉన్నత చదువులకు దూరం అవుతున్నారని పేర్కొన్నారు. ఎన్నికల ప్రచారంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఈ జీవోను రద్దు చేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. దాన్ని నెరవేర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌ఎస్‌వైఎఫ్ జిల్లా కన్వీనర్ నాగేంద్రబాబు, నగర నాయకుడు విష్ణు పాల్గొన్నారు.

పరామర్శ


చెన్నకేశవరెడ్డిని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

కమలాపురం : మండల వైస్ ఎంపీపీ చెన్నకేశవరెడ్డిని శుక్రవారం మాజీ ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి పరామర్శించారు. చెన్నకేశవరెడ్డి ఇటీవల అనారోగ్యానికి గురై హైద్రాబాద్‌లో చికిత్స పొంది ఇంటికి వచ్చారు. ఈ విషయాన్ని తెలుసుకున్న రవీంద్రనాథ్‌రెడ్డి ఆయన నివాసానికి చేరుకుని పరామర్శించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు గంగాధర్‌రెడ్డి, సుమిత్రా రాజశేఖర్‌రెడ్డి, మారుజోళ్ల శ్రీనివాసరెడ్డి, కొండారెడ్డి, శివ కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.